క్లుప్తంగా

7 నుంచి పంచాయతన యాగ మహోత్సవాలు


సంతోషిమాత అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సంతోషిమాత సహిత పంచాయతన యాగ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, సూర్య నమస్కారాలు, ప్రత్యేక పారాయణలు, చండీహోమం, శత కలశాలతో పరిమళ సుగంధ ద్రవ్యాములతో అమ్మవారికి అభిషేకం, మహా పూర్ణాహుతి జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్న్‌షిప్‌కు ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోసం విశాఖపట్నంకు చెందిన హెచ్‌ఎంఐఈఎస్ సొల్యూషన్స్ సంస్థ సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు, హెచ్‌ఎంఐఈఎస్ దీనీష్‌కుమార్ హిరావత్ సంతకాలు చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, అధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులకు శిక్షణ సైతం అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు అందిచనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రాంతి విద్యానికేతన్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అమ్మడు తదితరులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి సింగుపురం గ్రామంలోని క్రాంతి విద్యానికేతన్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సోమవారం నిర్వహించిన అబాకస్ పరీక్షల్లో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 9న విజయవాడలో జరుగు పోటీలకు వీరు హాజరవ్వనున్నారు. అబాకస్ పరీక్షల్లో జూనియర్ కేటగిరి విభాగంలో జి.వేణుగోపాల్ (5వ తరగతి), ఆర్.హేమసుందర్ (4వ తరగతి) అర్హత సాధించారు. వీరి ఎంపికపై స్కూల్ కరస్పాండెంట్ గుండ అమ్మడు హర్షం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు.

భయపెడుతున్న హైవే నోటీసులు


స్థానికులకు నోటీసులు అందిస్తున్న హైవే అధికారులు

రణస్థలం: జాతీయ రహదారుల సంస్థ అధికారులు గత మూడు రోజులుగా రణస్థలం టౌన్‌లోని వ్యాపారులు, స్థానిక భవన యజమానులకు అక్రమ స్థలం ఖాళీ చేయాలని నోటీసులు అందిస్తోంది. దీంతో అందరూ భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ క్షణం ఏం జరుగుతుందో, హైవే అధికారులు ఎంత వరకు తొలగిస్తారో స్పష్టమైన వైఖరి తెలియజేయకపోడంతో అందోళన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు కలుగజేసుకొని, హైవే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అందరి భయాలను తొలగించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఎస్.ప్రసాద్‌ను వివరణ కోరగా రథ సప్తమి అనంతరం సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతానన్నారు.

రాజశ్యామలాదేవికి పుష్పాభిషేకం


రాజశ్యామలాదేవికి పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న రాజశ్యామలా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పాభిషేకం జరిగింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో ఉదయం చిన్నారులకు అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు జరిగాయి. అనంతరం రాత్రి అమ్మవారికి ద్వాదశ హారతులు ఇవ్వడం జరిగింది.

పాఠశాలలో బియ్యం చోరీ..?


పాఠశాల ప్రహరీ పక్కన ఇద్దరు వ్యక్తులు బియ్యం మూట తీసుకెళ్తున్నట్లు వైరల్ అయిన ఫొటో

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం నిల్వ చేసిన బియ్యం స్థానికంగా ఒక వ్యక్తి చోరీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. బైక్‌పై బియ్యం ఆదివారం చోరీ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే దీనిపై మండల విద్యాశాఖ అధికారి కె.పున్నయ్య మాట్లాడుతూ.. చోరీకి అవకాశం లేదని, స్టోర్‌రూం తాళాలు హెచ్‌ఎం దగ్గర ఉంటాయన్నారు. హెచ్‌ఎం బి.మురళీ మాట్లాడుతూ ఎటువంటి చోరీ ఘటనలు చోటుచేసుకోలేదని స్పష్టం చేశారు. బియ్యం స్టాక్ సైతం పాఠశాలలో లేదని తెలిపారు.

రఘువర్మకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ మద్దతు


ఎమ్మెల్సీ పాకలపాటికి సంఘీభావం తెలుపుతున్న ఎస్‌ఎల్‌టీఏ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) ఆంధ్రప్రదేశ్ బేషరతు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రఘువర్మకు సంఘీభావంగా విజయనగరంలో నిర్వహించిన సమావేశంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగ నాయకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(257) బలపరిచిన అభ్యర్థిగా ఉపాధ్యాయులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, ఉపాధ్యాయ పక్షాన అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేసిన పాకలపాటికే తమ మద్దతు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గొడబ మేరీప్రసాద్, కేజీ శ్రీనివాసరావు, అరసవల్లి గణపతిరావు, సీహెచ్ జనార్ధనరావు, జి.వినయ్‌కుమార్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం కల్చరల్: బలగ హరేరామ మందిరంలో శ్రీపంచమి పూజలు


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల జ్ఞాన సరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

ఘనంగా అక్షరాభ్యాసాలు

వసంత పంచమి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. పలుచోట్ల సరస్వతీ హోమాలు నిర్వహించారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జి.సిగడాం: సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థినులు


ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న దృశ్యం


శ్రీకాకుళం కల్చరల్: కాలభైరవ పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు

రణస్థలం: మండలంలోని కోష్ట గ్రామంలో శ్రీకృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలోని గోకులానంద ఆశ్రమంలో నిర్మితమైన జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 7వ తేదీ వరకు 5 రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు అగ్ని ప్రతిష్ఠ, కలశాలతో పూర్ణ కుంభం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. 7వ తేదీన ఉదయం 11:30 గంటలకు విగ్రహ పత్రిష్టా మహోత్సవం ఘనంగా జరుగుతుందని నిర్వాహకులు కేశవ మహారాజ్ గోస్వామి తెలిపారు.


అగ్ని ప్రతిష్టలో పాల్గొన్న శ్రీకృష్ణ చైతన్య మఠం స్వామీజీలు

కార్యకర్తలకు అండగా ఉంటా


మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామస్థాయిలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల నియోజకవర్గం స్థాయిలో వివిధ అనుబంధ విభాగాల్లో అధ్యక్షులుగా నియమించబడిన చిత్తిరి మోహన్, చందక సతీష్, ఈసర్ల గోవిందరావు, చిక్కాల ధర్మారావులు కిరణ్‌కుమార్‌ను సోమవారం సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు దోల వెంకటరమణ, ఎంపీటీసీ పెద్ది శ్రీనివసరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితులపై మాక్ డ్రిల్


అపస్మారక స్థితికి వెళ్లిన భక్తులను పోలీసులు తక్షణమే మోసుకుంటూ వెళ్తూ...


ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ చేస్తున్న వైద్యులు

శ్రీకాకుళం క్రైమ్: రథ సప్తమి ఉత్సవాలు పురస్కరించుకొని భక్తుల రద్దీ దృష్ట్యా ఒకవైపు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తూనే, మరోవైపు అత్యవసర పరిస్థితులపై ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మెడికల్, అగ్నిమాపక, రెవెన్యూ, ఇతర విభాగాల సమన్వయంతో మాక్‌డ్రిల్ ద్వారా డెమో ప్రదర్శన సోమవారం నిర్వహించారు. భక్తులు అనుకోకుండా అపస్మారక స్థితి, అస్వస్థతకు గురైతే పోలీసు సిబ్బంది తక్షణ స్పందనగా ఏవిధంగా క్యూలైన్లో నుంచి బయటకు తీసుకురావాలో సూచించారు. అలాగే వైద్యులు, ఇతర సిబ్బంది తక్షణమే ప్రథమ చికిత్సతో పాటు అత్యవసర చికిత్స, హృదయ, శ్వాసకోశ పునరుజ్జీవనం (సీపీఆర్), అంబులెన్సు ఎక్కించడం వంటివి ప్రదర్శనగా చేయించారు.



దివ్యధామం

అనాదిగా స్వామికి సేవ చేస్తున్న సనక, సనందులను ఎప్పుడైనా చూశారా..? తిరుపతి వెంకన్నకు అరసవల్లి ఆదిత్యునికి ఓ పోలిక ఉంది ఎన్నడైనా గమనించారా..? ఇంద్రుడికి ఆదిత్యుడి విగ్రహం ఓ పుష్కరిణిలో దొరకగా.. ఈ ఆలయం కట్టారు. ఆలయం ధ్వంసమయ్యాక అదే విగ్రహం మరోసారి బావిలో నుంచి తీశారు తెలుసా..? అపురూప శిల్పకళతో శోభిల్లే శాలిగ్రామ శిలను తదేకంగా ఎన్నడైనా చూశారా..? అరసవల్లి అరుదైన క్షేత్రమే కాదు.. అడుగడుగునా అపురూప రహస్యాలను తనలో దాచుకున్న ఓ దివ్యధామం. కళ్లతో కాదు..మనసుతో చూస్తే ప్రతి మర్మం తెలుస్తుంది. దానికి రథ సప్తమి నిజరూప దర్శనకాలానికి మించిన సమయం లేదు.


– అరసవల్లి



కనరో భాగ్యము..

ఏడు గుర్రాలు..ముగ్గురు భార్యలతో అరసవల్లి క్షేత్రంలో శ్రీవారు కొలువుదీరారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవి అనే ముగ్గురు భార్యలతో సూర్యభగవానుడు శాలిగ్రామ ఏక శిలతో విగ్రహరూపుడై ఉంటారు. స్వామి సింహలగ్న జాతకుడైనందున ఆయన విరాట్టుపై సింహతలాటం ఉంటుంది. ఆయనకు రెండు హస్తాలుంటాయి. వాటితో రెండు తామర పద్మాలను పట్టుకుని ఉంటారు. స్వామివారికి సనక, సనందులు అనే ఇద్దరు సేవకులు నిత్యం.. ఛత్ర, ఛామరలతో స్వామికి సేవ చేస్తుంటారు. స్వామివారి నడుముకు చురిక (చిన్న కత్తి) ఉంటుంది. తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఇలానే చురిక ఉంటుంది.

కిరణ స్పర్శ..



మూలవిరాట్టు ఉన్న స్థానబలమో, స్వామి వారి మహిమ వల్లనో గానీ, ప్రతి ఏటా ఉత్తరాయణ, దక్షిణాయన కాలమార్పుల్లో నేరుగా తొలి లేత కిరణాలు నేరుగా స్వామి వారి మూలవిరాట్టును ప్రతి భాగమూ స్పృశించడం ఇక్కడి క్షేత్ర మహత్యంగా చెప్పుకుంటారు. ఈ లెక్కన ప్రతి ఏటా మార్చి 9,10 తేదీల్లోనూ, అలాగే అక్టోబర్ 1,2 తేదిల్లోనూ స్వామి వారిని సూర్య కిరణాలు తాకుతుంటాయి. ఆరోగ్యం కోసం ఇక్కడ సూర్యనమస్కార పూజలు చేస్తూ స్వామిని నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండడంతో సూర్యక్షేత్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది.

వరుదు వంశీయుల ఉదారత్వం..

ఇప్పిలి వంశీయుల అర్చకత్వం

1999లో ప్రముఖ గ్రానైట్ వ్యాపారి దివంగత వరుదు బాబ్జీ దంపతులు ఆలయ వాస్తు నిర్మాణం దెబ్బతినకుండా గర్భగుడిపై విమానాన్ని పడగొట్టి, దక్షిణాది పద్ధతిలో కాకుండా ఓఢ్ర (ఒడిశా) సంప్రదాయంతో పునర్నిర్మించారు. రథం ఆకృతిలో ఈ నిర్మాణం దర్శనమిస్తుంది.

– ఈ దేవాలయంలో ఇప్పిలి వంశీయులు వంశపారంపర్య అర్చకత్వం వహిస్తూ భక్తులకు స్వామికి అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన అర్చకులుగా ఇప్పిలి శంకరశర్మ వ్యవహరిస్తున్నారు.

నాడు హర్షవల్లి.. నేడు అరసవల్లి



ప్రత్యక్ష దైవం శ్రీసూర్యనారాయణ స్వామి వారు కొలువైన ఏకైక సూర్య క్షేత్రంగా, దేశంలోనే నిత్య పూజలందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా అరసవల్లి విరాజిల్లుతోంది. శతాబ్దాల క్రితం నుంచి ఆరోగ్యం కోసం ఇక్కడ విగ్రహానికి పూజలు చేసేవారు. తలనీలాలను సమర్పించి, ఇంద్ర పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి సూర్యనమస్కారాలు చేసేవారు. ఇలా చేయడంతో తమ కోర్కెలు ఫలించడంతో పాటు పూర్తి ఆరోగ్యవంతులుగా తమ ప్రాంతాలకు సంపూర్ణ హర్షంతో తిరిగి వెళ్లేవారు. అందువల్ల ఈ క్షేత్రానికి హర్షవల్లి అని పిలిచేవారని ప్రతీతి. అయితే కాలక్రమేణా ఇది అరసవల్లిగా మారింది.